# సమర్పయామి

ఇల్లంతా మౌనం రాజ్యమేలుతున్నది. బంగారు గొలుసు పోవడం మా ఇంట్లో అందరి మనసులనూ బాధపెట్టింది. ఒక రోజంతా ఎవరం సరిగా భోజనమే చేయలేదు. కంటికి నిద్రా, ఒంటికి విశ్రాంతీ కరువయ్యాయి. గొలుసు ఎలా పోయిందో ఎవరికీ అంతు చిక్కటంలేదు. ఆరోజు మా ఇంటికి కొత్త వాళ్లెవరూ రాలేదు. ఇరుగూ పొరుగూ వచ్చి వెళుతుంటారు కానీ వాళ్ళని అనుమానించే అవకాశమే లేదు. ఆ ఇంట్లో పది సంవత్సరాల నుంచీ వుంటున్న మాకు వాళ్ల విషయాలూ, వాళ్లకు మా స్వభావాలూ పూర్తిగాతెలుసు అసలు వాళ్ళమీద అనుమానం రావటమే అమానుషం అవుతుంది.

ఇక మిగిలింది పనిమనిషి ముత్యం ఒక్కతే. తనుకూడా మా ఇంట్లో గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నది. అటువంటి దొంగబుద్ధు లున్న మనిషి కాదు. అయినా, తన పేదరికం, డబ్బు అంటే మనిషికి ఉండే బలహీనత మాకు అనుమానం కలగజేసిన మాట నిజమే! అయినప్పటికీ ముత్యాల్ని ఇంతవరకూ మాలోఎవరూ ఏమీ అడగలేదు గొలుసు విషయం. మాతోపాటు తనూ బాధ పడడం, ఏమాత్రం భయం లేకుండా ఎప్పటిలానే మసలుకోవడం –మా నోరు విప్పనీయలేదు.

అప్పుడే గొలుసు పోయి మూడు రోజులయింది. ఎంతలేదన్నా దాని విలువ నాలుగు వేలకి తక్కువ ఉండదు. ఈ మూడు రోజుల్లోనూ మా బామ్మ మంత్రాలు, ప్రశ్నలు, జవాబులు వగైరా కార్యక్రమాలన్నీ జరిపి వెరసి ఒ పచ్చ కాగితం ఖర్చు చేయించింది నా చేత. అయినా ఫలితం శూన్యం.

తెలుగు పుస్తకం చదువుకుంటున్న మా పదేళ్ళ వరుణ్ పరుగెత్తుకుంటూ నాదగ్గరకు వచ్చాడు.

"రుక్మిణి ఒక్క తులసిదళం వేయగానే పైకి లేచిన శ్రీకృష్ణుడు సత్యభామ ఎంత బరువు వేసినా ఎందుకు తూగలేదు నాన్నగారూ?" అంటూ ధర్మసందేహం వెలిబుచ్చాడు.

నేను మౌనంగా ఉండిపోయాను.

"రుక్మిణి అంటే కృష్ణుడికి ఇష్టమా?" అడిగాడు.

"అవతలకి పోరా వెధవ ప్రశ్నలూ, నువ్వూనూ! నన్ను విసిగించకు" అని కసురుకున్నాను వాణ్ణి.

పాపం చిక్కముఖం వేసుకుని వెళ్ళిపోయాడు వరుణ్.

మరో సమయంలో అయితే వాడి సందేహాన్ని తీర్చి ఉండేవాణ్ణేమో కానీ రాత్రి శ్రీమతి గొలుసు విషయం చెప్పిన దగ్గరినుంచి నా మనసు మనసులో లేదు. దాన్ని గురించే ఆలోచిస్తున్నాను. అప్పటికప్పుడే ఆ గొలుసు దొరక్కపోతే బాగుండుననే నిర్ణయానిక్కూడా వచ్చేశాను.

నా నిర్ణయాన్ని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వుండవలసింది.

అనాలోచితంగా అనేశాను. అంతే! అందరూ నామీద విరుచుకు పడ్డారు. నేను తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నానన్నారు. మూర్ఖుడ్ని అన్నారు. మొండిగా మాట్లాడతా నన్నారు. ఎందుకూ పనికిరా నన్నారు, అనకేం చేస్తారు పాపం! నిజం వాళ్ళకి తెలిస్తేగా!

మర్నాడు ఉదయాన్నే నా స్నేహితుడొకడు వచ్చాడు మా ఇంటికి. గొలుసు పోయిందన్న విషయం వాడికీ తెలుసు. వచ్చిన వాడు ఊరికే ఉండక తనకి పోలీస్ డిపార్టుమెంట్‌లో తెలిసినవాళ్లు న్నారనీ, కాస్తో కూస్తో ఖర్చుపెడితే వాళ్ళు శ్రద్ధగా ఆచూకీ తీసి మన వస్తువుని తెచ్చిపెడతారనీ మావాళ్లందరిముందూవాగాడు. అదినిజమే అయితే కావచ్చు. కాని నాకు మాత్రం వాడలా చెప్పటం మహా కోపం తెప్పించింది.

నేను అనుకున్నంతా అయింది. వాడు గడప దాటాడో లేదో అందరూ ఒక్కసారి ప్రారంభించారు సలహా లివ్వటం. సారాంశం ఏమిటంటే నాలుగయిదొందలు పోయినా నాలుగువేల వస్తువు వస్తుం దంటున్నాడు కాబట్టి రంగంలోకి దిగాలని.

పైగా వాడింకో విషయం కూడా చెప్పి వెళ్లాడు. మనం వాళ్లకి ఇవ్వవలసిన మొత్తం ముందరే ఇవ్వనక్కర లేదనీ, సగం ముందు గానూ, మిగిలిన సగం మన వస్తువు దొరికిన తర్వాత ఇచ్చేటట్లుగా తనే ఏర్పాటు చేస్తానన్నాడు. కాబట్టి మా వాళ్ళ లెక్క ప్రకారం ప్రస్తుతం ఓ రెండు వందలు వాళ్ల చేతుల్లోపెట్టి, ఎలాగైనా గొలుసు దక్కేటట్లు చూడమని బ్రతిమలాడడం. పనయ్యాక మరో రెండు వందలు ఇవ్వడం చేయాలి.

ఇప్పటికే బామ్మ ప్రశ్నల కింద ఓ నూరు ఖర్చు చేసిందికదా. ఇప్పుడు మరో రెండొందలు. దొరికాక మరో రెండొందలు ...! రెండొంద లెలాగ...? అంతే నా మనసిక పని చేయలేదు. ఇక ఏ లెక్కలూ చూడలేకపోయాను.

"గొలుసు పోతే పోయింది. ఇక ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టను" కచ్చితంగా చెప్పేసి చరచరా బయటకు నడిచాను.

అసలు గొలుసు పోయిన బాధకంటే. నా ప్రవర్తన మా వాళ్లందరికీ మనస్తాపాన్ని కలిగించింది. నే నెందుకు ఉదాసీనంగా ఉంటున్నానో వాళ్లకి అంతు చిక్కటం లేదు. గొలుసు పోతేపోయిం దన్న భావం నాలో ఎందుకు కలిగిందో' అని ఆలోచిస్తున్నా రంతా.

అసలు వీడే ఏదయినా 'వెధవ పని కోసం (వెధవపని అంటే బంగారు వస్తువుని అమ్మి ఏ టు ఇన్ వన్ టేప్ రికార్డరో లేక మరొకటో కొనడం) బంగారం లాంటి గొలుషు అమ్మి నాటకం ఆడుతున్నాడా' అనే చిన్న సందేహం కూడా మా బామ్మకు కలిగిందేమో!

బామ్మ అభిప్రాయంతో ఏకీభవిస్తూ కాసేపు, ఏకీభవించక కాసేపూ తల ఓసారి అయివుండవచ్చన్నట్లుగాను, మరోసారి కాద న్నట్లుగానూ తిప్పుతూ తనలో తనే తర్జన భర్జనలు జరుపుతున్న అమ్మను నేను గమనిస్తూనే వున్నాను.

ఇక నాన్నగారి విషయాని కొస్తే ఇలాంటి లౌకిక విషయాల పట్ల ఆయన ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉదయాన్నే సంధ్యావార్చక పోతేనూ, మడిబట్ట కట్టుకుని భోజనం చేయకపోతేనూ మాత్రమేఆయ నకు నామాద కోపం వస్తూంటుంది. అటువంటి విషయాల్లోనే ఆయ

నకూ నాకూ అప్పుడప్పుడు వాగ్వివాదం జరుగుతుంటుంది. అంతే కాని ఇటువంటి విషయాలలో ఆయన నిర్లిప్తంగా ఉండిపోతారు. ఒకవేళ జోక్యం చేసుకున్నా ముక్తసరిగా మూడు మాటల్లో తనఅభిప్రాయం చెప్పి వదిలేస్తాడు.

పాపం, శ్రీమతి నా అవస్థ గమనిస్తూనే ఉంది. ఏ కారణం చేత నేనలా అన్నానో తెలుసు కాబట్టి ఏదీ తేల్చుకోలేక నాలాగే ఆమెకూడా ఇబ్బంది పడుతున్నది. పైగా ఆ విషయం మరెవ్వరికీ చెప్పవద్దని చెప్పాను నేను. మరొక్క రోజు నా ఉదాసీనతని సహించారు ఇంట్లోవాళ్ళు.

ఉదయం నిద్ర లేవగానే "గొలుసు విషయం ఏమనుకుంటున్నావురా?" అనడిగింది అమ్మ.

"వా డెందుకు అనుకుంటాడే? నాలుగు వేలు వాడికోలెక్కా? మహారాజు బిడ్డాయె" దీర్ఘాలు తీస్తూ బామ్మ వెటకారాలు.

"మరి లేకపోతే ఏమిట్రా? ఆ అబ్బాయి అంత శ్రద్ధగా చెప్పి వెళితే ఆ సంగతే పట్టించుకోకుండా తిరుగుతావ్! పాపం రాత్రికూడా వచ్చి వెళ్లాడతను" అనునయంగా అన్నది అమ్మ.

"కందకి లేని దురద కత్తి కెందుకు? పోయిన గొలుసు వాడి పెళ్ళానిది. ఉన్నా, పోయినా వాడి వస్తువేగా? మీరంతా ఎందుకుట అంత ఆరాటపడతారు? వాడేం పసిపిల్లవాడా అన్ని రకాలుగా చెప్పటానికి? అయినా, వాడికి మనం చెప్పగల వాళ్లమా?" నిష్ఠూరంగా అన్నారు నాన్న.

అన్నింటినీ మౌనంగా భరించాను. ఎవరికీ ఏం సమాధానం చెప్పలేదు. కానీ, నేను ఒక్క తెలివిగల పనిమటుకు చేశాను. నా

భార్య ఆరోజు నాకు చెప్పిన విషయాన్ని మరెవ్వరికీ చెప్పవద్దని చెప్పటమే నేను చేసిన తెలివైన పని. లేకుంటే గొలుసు పోయినం దుకు కాకపోగా మరొకందుకు మరోరకం రభస జరిగేది.

అప్పటికి మా అత్తగారు కూడా మా ఇంట్లోనే ఉంది. ఆవిడ ముందు వీళ్ళంతా నన్నిలా అనటం నాకు కొంత చిన్నతనం అని పించినా, ఆమె తెలివిముందు నేను చిన్నబుచ్చుకోవలసిన అవసరం లేదనిపించింది. అసలు ఆమె కారణంగానే నే నా నిర్ణయానికి రావ లసి వచ్చిందనే విషయం దాచాలా, వద్దా? ఈ ప్రశ్నతో సతమత మవుతున్నా న్నేను.

ఆ రాత్రే శ్రీమతితో చెప్పాను ఎలాగైనా సరే వాళ్ల అమ్మ మనసు బాధపడకుండా ఉండేలా సర్ది చెప్పి వూరు పంపించమ న్నాను. ఆమె వెళ్ళాక అసలు విషయం ఇంట్లో వాళ్లకి చెప్పాలని నా అభిప్రాయం.

“బోజనం పూర్తవగానే నీ స్నేహితుడి దగ్గరకు వెళ్లి ఆ రెండొందలూ ఇచ్చి గొలుసు విషయంలో నీవు ఏదైనా చేస్తావా – లేకపోతే నన్నే వెళ్ళిరమ్మంటావా?” హెచ్చరింపుగా అన్నదిబామ్మ.

నవ్వాలో, ఏడవాలో తెలియక మొత్తంమీద చివరికి బిగ్గర గా నవ్వేశా న్నేను.

“గొలుసు పోయిందన్న దిగులుతో మేం నిద్రాహారాలు మాని ఏడుస్తుంటే, నీకు నవ్వులాటగా ఉంది. ఇదెక్కడి చిత్రంరానాయనా! ఈ ముసలిముండ దగ్గర డబ్బు లెక్కడున్నాయిలే అనుకుంటున్నా వేమో! ఇదిగో ఈ ఉంగరం అమ్మేనయినాసరే నేనా అబ్బాయికి

డబ్బిచ్చి వస్తాను. ఏమనుకున్నావో?" శపథం చేసింది పిచ్చిబామ్మ.

అంతలోనే ఆమె అన్నంతపనీ చేస్తుందనే అనుమానం, వెంటనే భయంకలిగాయి నాకు. ఇక లాభం లేదనుకున్నాను. రేపు ఈ కథను ముగించాలనుకున్నాను. ఎలా కష్టపడిందో పాపం నా శ్రీమతి, వాళ్ళ అమ్మని ప్రయాణానికి సిద్ధం చేసింది. ఓ సమస్య తీరింది నాకు. ఆమెను బస్సు ఎక్కించి తిరిగివచ్చా నేను.

"ఆ అబ్బాయిని కలుసుకున్నావా?" అడిగింది బామ్మ.

"లేదు....కలుసుకోను." చెప్పాన్నేను.

పడకకుర్చీలోంచి ఒక్క ఉదుటన లేచింది బామ్మ విడిపోయిన వెంట్రుకలను కసిగా ముడివేసుకుంటూ "అయితే నేను వెళుతున్నా"నంటూ బయటకు నడవబోయింది.

"ఆగు!" అరిచాన్నేను. నవ్వును బలవంతాన ఆపుకుంటూ కోపం నటించాను.

స్థాణువులా నిలబడిపోయింది పాపం బామ్మ. నా అరుపుకి ఏడుపు లంకించుకుని శ్రీమతి దగ్గరకు పరుగెట్టాడు వరుణ్.

వాణ్ణి ఓదారుస్తూ వీధి గేటువైపు నడిచిందామె.

"ఏమిట్రా నీ ఉద్దేశం?" అయోమయంగా అడిగింది అమ్మ.

"ఒక్క అయిదు నిముషాలు ఓపిక పట్టండి. అసలువిషయం నేనే చెపుతాను" అంటూ బామ్మ దగ్గరకు వెళ్ళి ఆమెను పట్టుకుని పడక్కుర్చీవరకు నడిపించుకుంటూ వచ్చి కూర్చోపెట్టాను.

కోపంగా ఎటో చూస్తూ కూర్చున్నది బామ్మ. 'గొలుసు ఖరీదెంత ఉంటుందన్నావ్ బామ్మా?' ఆమెని మాట్లాడించాలని అడిగాన్నేను.

మరింత సీరియస్‌గా నా వంక చూసి విసురుగా తలతిప్పు న్నదామె.

'పిచ్చి ప్రశ్నలు వేయకుండా అసలు సంగతి చెప్పరా!' చిరు పంగా అన్నది అమ్మ.

మీ రనుకుంటునట్టుగా ఆ రెండు వందలూ వాడికి ఇచ్చినా, గొలుసు దొరకలేదనుకోండి మొత్తం దాని ఖరీదుతో పాటు మనకి నష్టం ఎంత?....బామ్మ ప్రశ్నలకు పెట్టిన నూరుతోసహా నాలుగు వేల మూడువందలు ప్లస్ రిక్షాలు, కాఫీలువగైరా చిల్లర మల్లరలతో సహా వెరసి నాలుగువేల నాలుగువందలు. అవునా?'

'ముందే మనం దొరకదనుకుం....'

'నేను చెప్పే విషయం పూర్తిగా విన్నాక మీరు ఎవరు ఎలా చెప్తే అలా చేస్తాను. అందుకే ఎవ్వరూ మాట్లాడకండి.' బామ్మమాట ను మధ్యలోనే ఆపేసి అన్నాన్నేను.

'సరే, వినిపించు.' మూతి మూడువంకర్లు తిప్పింది బామ్మ.

మా అత్తగారు గుర్తొచ్చి ఒక్కసారిగా పగలబడి నవ్వేన్నేను. నా నవ్వు అసందర్భం అనిపించింది కాబోలు, అందరూ విసుగ్గా నా వైపు చూశారు.

'అదే—మన గొలుసు మనకి దొరికిందనుకోండి. అప్పుడు మన ఖర్చు మొత్తం చెప్తాను వినండి. ఇందాక చెప్పిన నాలుగు వందలు, వాడికి ఇవ్వవలసిన మరో రెండువందలు, తిరుపతి ప్రయాణానికి నేనూ, నా భార్యా మాత్రమే వెళ్ళినా మరో నాలుగువందలు.'

'తిరుపతి ప్రయాణమా?' ఆశ్చర్యంగా అడిగింది అమ్మ.

'అవును. మొక్కుబడి' అన్నాన్నేను.

'ఏవ....సరే. అయితేమాత్రం? నీవు చెప్పిన లెక్కప్రకా చూచుకున్నా మొత్తం వెయ్యికన్నా కాలేదు ఖర్చు. నాలుగువేల వ వుదొరికితే మూడువేలయినా మిగిలినట్టేగదా!' లెక్క తేల్చేసిందిబావ

'బామ్మా, ఆ మాత్రం లెక్కలు నాకుమాత్రం రావా? నీలెక తప్పు. గొలుసు దొరికితే మనకి అయ్యే మొత్తంఖర్చు అయిదువేల అన్నాన్నేను ...'అయిదువేలు' ఒత్తి పలుకుతూ.

అర్థంకానట్లు చూశా రందరూ.

'గొలుసు దొరికితే నా కూతురూ, అల్లుడూ తిరుపతివచ్చి తల నీలాలిచ్చి, ఆ గొలుసుని హుండీలో వేస్తారు. నాయనా' అని శ్రీశ్రీశ్రీ మా అత్తగారు—లేక నా శ్రీమతిగారి అమ్మగారు మొక్కుకున్నారట బామ్మా!'

బామ్మ కన్నూ, నోరూ మూస్తే ఒట్టు

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక—10-12-86)